క్లుప్తంగా

'దళితబంధు' మంజూరు చేయాలి

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో అర్హులైన దళితులకు దళితబంధు పథకాన్ని మంజూరు చేయాలని దళిత సంఘాల నాయకులు చింతలయ్య, కుర్మయ్య, ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకు దళితబంధు పథకం మంజూరు చేశారని, తమ గ్రామానికి ఈ పథకం వర్తింపజేయాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించామన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తమ లాంటి పేదలకు ఈ పథకం అమలు చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే స్పందించి తమ గ్రామంలో ఉన్న పేద దళితులు గుర్తించి వెంటనే దళితబంధు అమలు చేయాలని కోరారు.

నత్తనడకన మండల కాంప్లెక్స్ భవన నిర్మాణం



మరికల్: మండల కేంద్రం శివారులో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మండల కాంప్లెక్స్ సముదాయ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల కలెక్టర్ పనులను పర్యవేక్షించారు. ఇలా అయితే పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని కాంట్రాక్టర్‌ను, అధికారులను ప్రశ్నించారు. ఆగష్టు 15 లోపు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా నిర్మాణ పనుల్లో వేగం లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్, అద్దె భవనంలో ఎంపీడీఓ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

విజేతలకు అభినందన



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో గురువారం బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు భీంరెడ్డి క్రీడాకారులతో మాట్లాడాడు. ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ ఖోఖో పోటీల్లో గెలుపొందిన పరుషుల జట్టు సభ్యులను అభినందించాడు. క్రీడల్లో గెలుపు మరింత స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించి సీఎం కప్ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ చెన్నారం వెంకటప్ప, శరణుగోపాల్‌రెడ్డి, మోనేష్ పాల్గొన్నారు.

రివార్డు అందజేత

కోస్గి: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన కోస్గి ఎస్‌ఐ శ్రీనివాస్‌కు జిల్లా అదనపు ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందజేశారు. నేర పరిశోధన, రికార్డుల నిర్వాహణతోపాటు అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన ఎస్‌ఐకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు రివార్డు అందజేశారు. అదేవిధంగా రిసెప్షన్ విభాగంలోనూ పని చేస్తున్న డబ్ల్యూహెచ్‌సీ విజయమ్మకు రివార్డు దక్కింది. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ డీఆర్బీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: వివిధ కేసులలో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చిన ఎస్‌ఐ నరేందర్, అదేవిధంగా ఏఎస్‌ఐ మన్నన్‌లు గురువారం రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ సీతయ్య, సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

ధన్వాడ: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మాకం సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని, మండలంలోని అన్ని బూతు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, బీజేవెఎం నాయకులు పాల్గొనాల్సిందిగా కోరారు.

హన్మన్‌పల్లిలో కళాజాతా



ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లిలో గురువారం సాయత్రం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల ఏర్పడే అనార్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా 'పేట'

- ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి
- తొమ్మిదేళ్లలో ఎవరూ అంచనా వేయలేని అభివృద్ధి
- బాలికల ఉన్నత విద్యకు కృషి



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో నారాయణపేట జిల్లాను విద్యారంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.2.09కోట్ల ప్రత్యేక నిధులతో గురువారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న సాకారం కాని కలను ప్రభుత్వ పెద్దలను ఒప్పించి ఏయిడెడ్ కాలేజీని ప్రభుత్వ పరం చేయించడంతో పాటు ఉద్యోగ, అధ్యాపకులను న్యాయం చేశామన్నారు. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ కింద నారాయణపేట జిల్లాకు పాలిటెక్నిక్ కళాశాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. ధన్వాడకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుతో పాటు గత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకుని తరగతుల నిర్వహణ ప్రారంభించామని, బీఏ, బీకాం, బీఎస్సీ మూడు కోర్సుల్లో ప్రతి విభాగంలో 240 సీట్లు మంజూరు చేయించామన్నారు. అదేవిధంగా అప్పక్‌పల్లి వద్ద మెడికల్ కళాశాలను సాధించగలిగామని హర్షం వ్యక్తం చేశారు. నర్సింగ్ కళాశాలతో పాటు పీజీ స్టడీ సెంటర్ త్వరలో తీసుకుని వస్తున్నామని చెప్పారు. 40ఏళ్లలో జరగని అభివృద్ధి గడిచిన తొమ్మిదేళ్లతో చేస్తున్నామని తెలిపారు. మన ఊరు– మన బడి ద్వారా మూడు విడతల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. చదువుకునేందుకు సరైన సౌకర్యాలు, అవకాశాలు లేక వలసలు వెళ్లే స్థితి నుంచి, బయటి వ్యక్తులు ఇక్కడికి వచ్చేలా పురోగతి సాధించామని స్పష్టం చేశారు. బాలికలు, మహిళలు ఉన్నత విద్యకు దూరం కాకుండా విద్యాలయాలనే జిల్లాకు తీసుకుని వస్తున్నామని చెప్పారు. రాబోవు రోజుల్లో జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ప్రిన్సిపాల్ రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలీల పెండింగ్ డబ్బులు చెల్లించాలి



కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దామరగిద్ద: ఉపాధి హామీలో పనిచేసే కూలీల పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. కేంద్రం బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.25 వేల కోట్ల నిధులు తగ్గించి, ఉపాధి పథకాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. పనిచేసి తొమ్మిది వారాలు గడిచినా.. సకాలంలో కూలీ డబ్బు చెల్లించక కూలీలతో చెలగాటం ఆడుతుందన్నారు. వేసవి ఎండల తీవ్రతతో వడదెబ్బకు గురవుతున్న టెంట్లు, హెల్త్ కిట్‌లు, తాగు నీరు వంటి సౌకర్యాలను కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, గ్రామ అధ్యక్షుడు వెంకటప్ప, బుగ్గప్ప, హన్మంతు, శశిరేఖ, కాశమ్మ, అనిత పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు న్యాయం చేయాలి..

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల శ్రమదోపిడీని అరికట్టి, వారికి తగిన న్యాం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండలంలోని శేర్నపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాజి, రఘుపతి నాయక్, ప్రశాంత్, దస్తమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

'యాదవులకు క్షమాపణ చెప్పాలి'



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న యాదవ సంఘం నాయకులు

నారాయణపేట టౌన్: యాదవులను కించపరిచే విధంగా మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి యాదవుల సంఘం నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీసీ సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలరాజ్‌యాదవ్, గొర్రెల కాపరుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ అల్లాపురం నర్సింహులుయాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గొల్ల నర్సింహులు యాదవ్, బీసీ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, యాదవ హక్కుల యూత్ జిల్లా అధ్యక్షుడు చంద్రవంచ రమేష్ యాదవ్, హుస్నాబాద్ సర్పంచ్ పకీరప్పయాదవ్, నందిగామ వెంకటయ్య, గొర్రెల కాపరులు నాయకులు తరలివెళ్లారు.

ఇందిరాపార్క్ ధర్నాకు తరలిన యాదవులు..

కోస్గి: యాదవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'హలో యాదవ్.. చలో హైదరాబాద్' ధర్నా కార్యక్రమానికి పలు గ్రామాల యాదవ సంఘ నాయకులు తరలి వెళ్లారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన ధర్నాకు వెళ్లారు. తరలినవారిలో గొర్రెల కాపరుల సంఘం జిల్లా డైరెక్టర్ అల్లాపురం నర్సిములు, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నర్సిములు, బీసీ సేనా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా యూత్ అధ్యక్షుడు రమేష్‌తోపాటు పలువురు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నామాజీ

నారాయణపేట రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని ఎస్ఎస్‌కే సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు నాగురావు నామాజీ అన్నారు. స్థానిక సోమవంశ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్షత్రి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే చదువుతో పాటు సమాంతరంగా పిల్లలకు క్రీడలపై మక్కువ పెంచాలన్నారు. చెడు వ్యవసనాలకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. అంతకుముందు సహస్రార్జున్ మహారాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో నారాయణరావు, సూర్యకాంత్, లక్ష్మణ్, మహేష్, యువత పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



నర్వ: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అందరికి ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేసుకుందామని పీహెచ్‌సీ వైద్యుడు డా.కేశవ్ అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ జయరాములుశెట్టి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు సందర్శించారు. పీహెచ్‌సీకి కొత్త రంగులు, హంగులతో ఏర్పాటు చేయడంతో డా. కేశవ్‌ను వారు అభినందించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో రోగులు, ఇతర సహాయకులు సౌకర్యార్థం కుర్చీల ఏర్పాటుకు అరవింద్‌రెడ్డి, దండు అయ్యప్పలు విరాళాలు అందించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మండ్ల చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రం చిన్నారులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న శశికళ

నారాయణపేట రూరల్: బాలకేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 150మంది చిన్నారులకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శశికళ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా రాత పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న సమయంలో ఎంతో మంది తల్లులు తమ పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలనుకోవడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు కళలలో ప్రావీణ్యం పొందడం ఎంతో ముఖ్యమైందన్నారు. తబల, గాత్రం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణకు రావాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, సిబ్బంది సంగ నర్సింహులు, వసంత్, జ్ఞానామృత, శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ అందజేత



నారాయణపేట రూరల్: మండలంలోని శ్యాసన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారంతో ప్రింటర్ సమకూర్చారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాజమ్మ మనుమడు పుట్టినరోజు సందర్భంగా డబ్బులను వృథాగా ఖర్చు చేయకుండా విద్యాభివృద్ధికి సహకరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పాఠశాలలో అత్యవసరమని భావించిన ప్రింటర్‌ను గురువారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీష్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గందె చంద్రకాంత్, సందుల భగవంతు, బస్వరాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ జైరాములు, పూర్వ విద్యార్థులు, వాజీద్‌పాషా, లక్ష్మణ్, రాజేశ్వరి, శ్రీనివాస్, బల్చిలాల్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



పాథర్చేడ్‌లోని యూనిట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పాథర్చేడ్‌లో మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన యూనిట్లను ఆయన పంపిణీ చేసి ప్రారంభించారు. అనంతరం పాథర్చేడ్ గ్రామానికి చెందిన బోలుబండ లక్ష్మీకి రూ.2 లక్షల97 వేల విలువ గల ఫ్లోర్‌మిల్, ఏర్పుల సుజాతకు రూ.7 లక్షల విలువ గల ఆయిల్‌మిల్, రాజుపల్లి లక్ష్మీకి రూ. 6 లక్షల 97 వేల విలువ గల రోటీ మేకింగ్, కలాల్ సుజాతకు రూ. 2 లక్షల 93 వేల విలువ గల ఫ్లోర్‌మిల్ సంబంధించి మొత్తం నాలుగు యూనిట్ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం రాయితీలను కల్పించి, లోన్‌లను అందించి ఆర్థిక తోడ్పాటునందిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములు శెట్టి, వైస్ ఎంపీపీ వీణావతి, ఎంపీటీసీ శ్యాంలాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అరవింద్‌కుమార్‌రెడ్డి, నాయకులు డా.శంకర్, దండు అయ్యప్ప, రాజారెడ్డి, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

ఊట్కూర్: మండలంలోని భవానీ మందిర్‌లో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. నవగ్రహాలు, గణపతి, సింహం, తాబేలు తదితర విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కలశపూజ, హోమం, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవరి మల్లప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి తదితరులు హాజరయ్యారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్, ఎంపీటీసీ హన్మంతు, ఎల్కోటి నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, భవానీ మందిర్ అధ్యక్షుడు చౌద్రి అశోక్, చందూలాల్, దత్తూరావు, గోవింద్ రావు, వేద పండితులు హరిసర్వోత్తమా చారి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ఊట్కూర్: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బిజ్వార్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, ఉప సర్పంచ్ పొర్ల నర్సిములు, నాయకులు అరవింద్ కుమార్, సలీం, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ



నారాయణపేట రూరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జనార్దన్ హైజంప్‌లో గోల్డ్ మెడల్, 110ఎంహెచ్‌లో భరద్వాజ్ సిల్వర్ మెడల్, 3వేల మీటర్ల పరుగుపందెంలో మహేష్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు వీరిని అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి అంబరీష్, ఉపాధ్యక్షుడు నందునామాజీ, కోచ్ జగదీష్ అభినందించారు.

కొనసాగుతున్న మండల సాధన దీక్షలు



మాట్లాడుతున్న సౌజన్య

నారాయణపేట రూరల్: కోటకొండలో నిర్వహిస్తున్న మండల సాధన రిలే దీక్షలు గురవారం 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షను పీఓడబ్ల్యూ నాయకురాలు సౌజన్య ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌లను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. నాడు ఎన్‌టీఆర్ ప్రభుత్వంలోనే కోటకొండ మండలం అయ్యే అవకాశాలు ఉండగా, అప్పుడు చైతన్యం లేక వెనకబడ్డారని, ప్రస్తుతం ఉద్యమాన్ని ఉధృతం చేసైనా సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు, అఖిల భారత వ్యవసాయకూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

మాగనూర్: రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జై భీమ్ సేన సేవా సమితి సంఘం నాయకులు గురువారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యాంకి నాగేశ్వర్ మాట్లాడుతూ మండలంలోని మందిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పాటమ్మతో ఫేమ్ యాసరపు రాంబాబు, విగ్రహదాత కావలి కార్తిక్ హాజరవుతారని తెలిపారు.




ఆలయానికి కడప ప్రతిష్ఠాపన పూజలు



నారాయణపేట టౌన్: పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కడప ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగదీష్ దంపతులు కడపకు పూజలు చేపట్టారు. త్వరలో ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్‌కు తరలిన నాయకులు



మాగనూర్ మండలం నుంచి బయలుదేరుతున్న నాయకులు

మాగనూర్: భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన పీపుల్స్ మార్చ్ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీల ప్రజా వ్యతిరేక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కర్ణాటక ప్రజల మాదిరిగానే తెలంగాణలో కూడా ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వరాజు, చక్రపాణిరెడ్డి, వేణుగౌడ్‌నర్సింహ, కృష్ణయ్య, మొగ్గలప్ప, వెంకటప్ప, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

- అధికారుల తీరును ఎండగట్టిన సర్పంచ్‌లు
- అప్పులు తెచ్చి పనులు చేశామని ఆవేదన



సమస్యలను ప్రస్తావిస్తున్న మరికల్ సర్పంచ్ గోవర్ధన్

మరికల్: గ్రామంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, అప్పులు ఇచ్చిన వాళ్లకు ఏమని సమాధానం చెప్పాలని మరికల్ సర్పంచ్ గోవర్ధన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాయలంలో గురువారం ఎంపీపీ శ్రీకళ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సభకు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంతో సాదాసీదాగా సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గోవర్ధన్ మాట్లాడుతూ మరికల్‌లో రెండేళ్ల క్రితం పూర్తి చేసిన వైకుంఠధామానికి సంబంధించిన రూ.5 లక్షల బిల్లు ఇంకా రాకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై సభలో ప్రస్తవించారు. ఈ విషయంపై ఎంపీపీ డిప్యూటీ ఈఈ నరేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి బిల్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన నివేదికలను అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో ఉపాధి కూలీలకు ఎక్కువగా పనులు కల్పించి రోజు వారీగా వచ్చే కూలీ డబ్బులు పెంచేలా వారితో పనులు చేయించుకోవాలని ఏపీఓకు సూచించారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునే వారు కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, సర్పంచ్‌లు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, ఎంపీడీఓ యశోదమ్మ, విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, సంపత్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ నిలిపివేయాలి



ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లిలో గొర్రెల పంపిణీ కార్యక్రమం నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం మండల పశువైద్యాధికారి కార్యాలయ సిబ్బంది రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఒక్కొక్కరి ఇంట్లో ముగ్గురు నుంచి నలుగురికి గొర్రెలు మంజూరయ్యాయని, నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో సర్వే నిర్వహించి అర్హత ఉన్న వారికి గొర్రెలను అందజేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, రాములు, మల్లయ్య, పద్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.